క్లుప్తంగా

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు ఆయుష్మాన్‌భవ కార్డులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కరప: ప్రజాసంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలం వేములవాడలో ఆదివారం సర్పంచ్ కమిడి మంగాదేవి అధ్యక్షతన జరిగిన వికసిత్ భారత సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 20 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపి, ఎవరైనా రానివారుంటే తమ పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఉచిత గ్యాస్‌కనెక్షన్లు, ఆయుష్మాన్‌భవ కార్డులు ఇతర పథకాలను అధికారులు, నాయకులు అందజేశారు. దేశనాయకుల వేషధారణతో పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, కో ఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్‌గాంధీ, ముమ్మిడి పెద్దకాపు, కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ, వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య, కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దంతవైద్య శిబిరం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దంత వైద్యులు అడ్డాల సత్యనారాయణ, సువర్ణరాజు, సాయి కార్తీక్‌లను అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్.వెంకట్రావు, ఎస్.శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కాకినాడ సిటీ: ఎస్‌ఎఫ్‌ఐ 24వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి భవిష్యత్ ఉద్యమాల రూపకల్పనకు ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభ నగరంలో 27, 28, 29 తేదీల్లో నిర్వహించడం అభినందనీయమన్నారు. 29వ తేదీ మధ్యాహ్నం ఆనంద్‌భారతి గ్రౌండ్ నుంచి మెక్లారిన్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం. గంగాసూరిబాబు, టి.రాజా, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఖిద్మత్ కమిటీ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



రోడ్డుపై నిద్రించేవారికి దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఖిద్మత్ కమిటీ సభ్యులు

కాకినాడ సిటీ: నగరంలో ఖిద్మత్ కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కాకినాడ జామియా మసీదు అధ్యక్షుడు, న్యాయవాది ఎస్.ఏజాజుద్దీన్ అన్నారు. నగరంలో కొన్ని రోజులుగా చలి పెరుగుతుండడంతో రోడ్డుపై నిద్రించేవారికి వారు దుప్పట్లను అందించారు. అధ్యక్షులు షేక్ చిష్టి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏజాజుద్దీన్ పాల్గొని దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, హసన్ షరీఫ్, ఫక్రువుద్దీన్ ఆలీ, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఉద్యోగుల సమ్మె

కాకినాడ సిటీ: విద్యాశాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్టు టైం ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 5వ రోజుకు చేరింది. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో దత్త జయంతిని ఆదివారం నిర్వహించారు. మండలంలోని ఆయా వీధుల్లో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భజన సంకీర్తనలు, శ్రీరామ, ప్రసన్నాంజనేయ స్వామి నామస్మరణతో గ్రామాలు, పురవీధుల్లో మార్మోగాయి. స్థానిక మెయిన్‌రోడ్డు ప్రసన్నాంజనేయ స్వామి, పలు ఆంజనేయ ఆలయాల వద్ద భక్తులు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా చదలాడ ఆంజనేయ ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించగా, ఆయా హనుమాన్ ఆలయాల వద్ద అన్న సంతర్పణలు చేశారు.

ప్రభువు రాక ప్రపంచానికి పండగ

- గ్రామాల్లో అంగరంగ వైభవంగా క్రిస్మస్ సందడి
- విద్యుద్దీప కాంతులతో ఆకర్షణీయంగా చర్చిలు
- క్రీస్తు జీవిత విశేషాలతో సెట్టింగులు ఏర్పాటు



రమణయ్యపేట క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



చర్చ్ ఆఫ్ గాడ్ స్టేట్ ఓవర్‌సీస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ పద్మశ్రీ


కరప: మండలంలో క్రిస్మస్ సందడి నెలకొంది. గ్రామ, గ్రామానా చర్చిలను ఆకర్షణీయంగా అలంకరించారు. రాత్రింబవళ్లు క్రిస్మస్ గీతాల ఆలాపన, ప్రత్యేక ప్రార్థనలతో, ఆట, పాటలతో చర్చిలు మార్మోగుతున్నాయి. కరప, వేములవాడ, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, నడకుదురు, పెనుగుదురు, వేళంగి, కూరాడ, యండమూరు, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి, గురజానపల్లి, విజయరాయుడుపాలెం, జి.భావారం తదితర గ్రామాల్లో ఏసు పుట్టుక వివరించే చిత్రపటాలు, శిలువ మోయడం, గొర్రెల కాపరిగా ఇలా రకరకాల సెట్టింగులను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలకు సిద్ధంచేయగా, మరికొన్ని గ్రామాల్లో చర్చిలను ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధం చేస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు బైబిల్ చేతపట్టి చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ, నృత్యాలు చేయడం పరిపాటి. కరపలోని ఫెయిత్ గాస్పెల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు బిషప్ కె.అబ్రహం సామ్యూల్ ఏర్పాట్లు చేస్తున్నారు. క్రిస్మస్ రోజున ఉదయం నుంచి పాటలు పాడి, ప్రార్థనలు చేసి, లోకానికి క్రీస్తు చేసిన మంచికార్యాలను గుర్తు చేసుకుంటూ, ఆయన చేసిన బోధనలు, దైవసూక్తులు పాటిస్తూ, దైవజనులు ప్రారంభించిన తర్వాత రాత్రికి క్యాండిల్ సర్వీసు నిర్వహించి, అనాథలకు, వితంతువులకు దుస్తులు పంపిణీచేసి, ఆశీర్వదించడం జరుగుతుందన్నారు. ఏసుప్రభువు చేసిన మంచి కార్యాలు 365 రోజులూ తలంచుకుంటూ, ఆయన చూపిన మార్గాన్ని నడవాలని సందేశమిస్తామని బిషప్ తెలిపారు. కరపలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ పి.డేవిడ్‌రాజు, అరట్లకట్టలో జోసెఫ్ మెమోరియల్ బాప్టిస్ట చర్చిలో పాస్టర్ రెవరెండ్ జోసెఫ్ విక్టర్, గొడ్డటిపాలెంలోని ఫెయిత్ గాస్పెల్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ కె.డేవిడ్‌రాజు, యండమూరులోని గాస్పెల్ బాప్టిస్ట చర్చిలో పాస్టర్ ఐ.జాన్‌సూర్యప్రకాష్, కరపలోని చర్చి ఆఫ్ క్రైస్ట్ పాస్టర్ డాక్టర్ పి.శామ్యూల్‌రాజు, గొర్రిపూడిలోని జీసస్ ప్రేయర్‌టవర్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ డాక్టర్ జి.జాన్ ప్రసాద్, నడకుదురు క్రైస్ట్ బిలీవర్స్ చర్చిలో మండల పాస్టర్స్ యునైటెట్ ఫెలోషిప్ అధ్యక్షుడు, పాస్టర్ రెవరెండ్ డాక్టర్ మేడపాటి రాజ్‌కుమార్, ఇతర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు పాస్టర్లు, మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పి.డేవిడ్‌రాజు, సెక్రటరీ ఆర్.ప్రతాప్‌కుమార్, కన్వీనర్ పి.సత్యప్రసాద్‌బాబు తెలిపారు. వేళంగిలోని వేళాంకని మాతా దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ యండవ నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. చర్చిలో, ఆవరణలో ఏసు ప్రభువు పుట్టుక, శిలువ మోయడం, గొర్రెలు కాపరిగా ఇలా ప్రభువు జీవిత విశేషాలను వివరించే పలురకాల దృశ్యాలను వివరించేందుకు చిత్రాలను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు.

కరుణామయుని బోధలను అనుసరించాలి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సర్వ మానవాళికి ప్రేమను పంచిన, పాపుల రక్షకుడు, కరుణామయునిగా పేరుగాంచిన యేసుక్రీస్తు బోధలను అనుసరించి జీవించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక భానుగుడి జంక్షన్‌లోని ఐశ్వర్య గ్రౌండ్స్‌లో చర్చ్ ఆఫ్ గాడ్ స్టేట్ ఓవర్‌సీస్, సీవైఎఫ్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాస్టర్లకు గౌరవ వేతనం, చర్చిల అభివృద్ధికి నిధులు అందించారని తెలిపారు. సాంబమూర్తి నగర్‌లో ఇటీవల క్రైస్తవులకు ప్రత్యేక కమ్యూనిటీ హాలు ప్రారంభించినట్టు తెలిపారు. ప్రభుత్వం క్రైస్తవులకు అండగా వుంటుందని ఆయన అన్నారు. ద్వారంపూడి వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జిల్లా వైఎస్సార్ సీపీ ఐటీ సెల్ అధ్యక్షురావు కృష్ణప్రియ, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధిసీడి సుజాత తదితరులు ఉన్నారు.

కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్: లోక రక్షకుడు, కరుణామయుడు ఏసుక్రీస్తు జననం ప్రపంచానికి పండగ. క్రీస్తు రాకను ఆహ్వానిస్తూ మండలంలోని ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు ఏసు రాకను ఆహ్వానిస్తూ గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహించారు. రమణయ్యపేటలోని ఏపీఎస్పీ వద్ద రేస్ ఆఫ్ పీస్ వర్షిప్ చర్చ్ వద్ద జరిగిన రెవరెండ్ మూర్తిరాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టరు జమ్మలమడక నాగమణి, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎస్పీ డీఎస్పీ రాంబాబు తదితరులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కన్నబాబు క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వాడలో జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. రమణయ్యపేట రాయుడుపాలెంలో అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ చర్చిలో దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లోని ప్రార్థనా మందిరాలు క్రీస్తవ భక్తి గీతాలు, సందేశాలు, చిన్నారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



అరట్లకట్టలో విద్యుత్ అలంకరణలో చర్చి



రమణయ్యపేటలో ఏపీఎస్పీ వద్ద విద్యుద్దీపాలంకరణతో రేస్ ఆఫ్ పీస్ వర్షిప్ చర్చి

ప్రభువు ఆశీస్సులతో సంతోషంగా ఉండాలి

ఎమ్మెల్యే ద్వారంపూడి క్రిస్మస్ శుభాకాంక్షలు



నాగమల్లితోట జంక్షన్: లోక రక్షకుడు క్రీస్తు పుట్టిన రోజైన క్రిస్మస్ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సర్వమానవాళికి తన ప్రేమను పంచిన క్రీస్తు పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సుఖ సంతోషాలతో ఉండాలని, అందరికీ మంచి జరగాలన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని 2024లో నిర్వహించే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఘన విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చేలా ప్రత్యేక ప్రార్థన చేయాలని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి క్రైస్తవ సోదరీ సోదరీమణులు తమ ఆశీర్వాదాలు అందించాలని ద్వారంపూడి కోరారు.

దివి నుంచి వచ్చిన దేవదూత

- క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధం
- ఆరాధనకు ప్రత్యేక ఏర్పాట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నగరంలోని పలు చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతోద సుందరంగా అలంకరించారు. బాలాజీ చెరువు సెంటర్‌లోని క్రైగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి, రామారావు పేటలోని క్రైగ్ ఇమ్మానుయేలు చర్చి, సెయింట్ లూథరన్ చర్చి, గాంధీనగర్‌లోని హౌస్‌ఆఫ్‌ప్రేయర్, ఆంధ్రాబాప్టిస్టు చర్చి, జగన్నాధపురంలోని చర్చి స్క్వేర్ సెంటర్‌లోని రోమన్‌కేథలిక్ చర్చి, ఆంధ్రాబాప్టిస్టు చర్చి, కలెక్టరేట్ వెనుక గల సిటి టేబర్నికల్ చర్చి, చీడీల పొరలోని షాలేమ్ ప్రేయర్ హౌస్, రమణయ్యపేటలోని బెరాకాబ్లెస్సింగ్స్ చర్చి, ఏపీఎస్పీలోని రేస్ ఆఫ్ పీస్ చర్చి, వాకలపూడిలోకి యేసు ప్రేమాలయం, గైగోలుపాడులోని సెయింట్ లూథరన్ చర్చి, శాంతినగర్‌లోని క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ చర్చిలను శోభాయమానంగా అలంకరించారు.

ప్రత్యేక ఆరాధన

గాంధీనగర్ హౌస్ ఆఫ్ ప్రేయర్‌లో చర్చి వ్యవస్థాపకుడు పాస్టర్ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో పాస్టర్ మోజెస్ ఆధ్వర్యంలో, రామారావు పేట లూథరన్ చర్చిలో పాస్టర్ ఏ.శామ్యూల్‌రాజు, రిజర్వులైన్స్ పోలీస్ యూనియన్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ ఎం.చంద్రపాల్ ఆధ్వర్యంలో, క్రైగ్ చర్చి పాస్టర్ వరప్రసాద్, షాలేమ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ డి.శామ్యూల్ విక్టర్, బెరాకా బ్లెస్సింగ్స్ చర్చిలో పాస్టర్ జోసఫ్‌బెన్ని, కలెక్టరేట్ వెనుక గల సిటిటేబర్నికల్ చర్చిలో పాస్టర్ హెన్రీ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రత్యేక ఆరాధన ఏర్పాట్లు చేశారు. పేదలకు నూతన వస్త్రాల బహూకరణ, క్రిస్మస్ పోటీలలో విజేతలకు బహుమతులు అందించనున్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు జరిగే క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనలో దైవ సందేశం అందించేందుకు అతిథులను ఆహ్వానించారు. పెద్ద సంఖ్య క్రైస్తవులు ఈ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేస్తారు.



విద్యుత్ అలంకరణలో సిటీ టేబర్నికల్ చర్చి

క్రీస్తు జననం ప్రపంచ సత్యం



క్రీస్తు పుట్టకతోనే క్యాలెండర్ ప్రజలకు పరిచయమైంది. ఆయన జననం ప్రపంచ సత్యం కాబట్టే క్రీస్తు శకం, క్రీస్తు పూర్వ అని ప్రజలు అనుకుంటారు. ఈ ఏడాది క్రిస్మస్ వేడుకలు వివిధ చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– జి.జోసఫ్ బెన్ని, డీపీఎఫ్ గౌరవ అధ్యక్షుడు, బెరాకా బ్లెస్సింగ్స్ చర్చి



వడమాల అలంకరణలో సూర్యారావుపేటలోని సీతారామస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామి

వైభవంగా హనుమద్వ్రతం



కరప విష్ణాలయంలో హనుమద్వ్రతం పూజలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: నగరంలోని పలు ఆంజనేయ ఆలయాల్లో ఆదివారం హనుమంతునికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వయంభువుగా వెలసిన స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం చేశారు. నాగవల్లీ దళయుక్త గంగ సింధూర పూజ, వడమాల కైంకర్యం నిర్వహించారు. స్థానిక గాంధీనగర్ మల్లయ్య అగ్రహారంలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఉదయం స్వామికి ఆలయ అర్చకులు భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక ఎల్‌బీనగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్వ్రతం సందర్భంగా విశేష పూజలు చేశారు. స్వామి వారికి తమలపాకులపూజ, గంగసింధూర పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక కొండయ్యపాలెంలోని ఆంజనేయస్వామి వారికి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీటితోపాటు స్థానిక దేవాయంవీధిలోని ఆంజనేయస్వామి ఆలయం, జగన్నాథపురంలోని ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పలు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరపలో..

కరప: మండలంలోని వలసపాకల గ్రామంలో అర్చకుడు కొక్కిరిగడ్డ మణికంఠ ఆధ్వర్యంలో 11 మంది వేదపండితులు వల్లు వెంకటరమణ, పావని దంపతులతో లక్ష తమలపాకులతో అర్చన, అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ వాసంశెట్టి రామారావు, మాజీఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తదితరులు స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కరప జ్యోతిషాలయంలో సువర్చలా సహిత పంచముఖేశ్వర స్వామికి గాధావర్జుల కొండయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో వేద పండితులు లక్ష సింధూర అర్చన, అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అలాగే పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సౌందర్యలహరి పారాయణ



సౌందర్యలహరి పారాయణలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

బోట్‌క్లబ్: ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ అర్బన్‌జిల్లా ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిరంలో ఆదివారం సౌందర్యలహరి పారాయణ చేశారు. అనంతరం మెగా హౌసీలు, చిలిపి ప్రశ్నలు– చలాకీ భామలుతో పాటు పలు పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించారు. వాసవీ మహిళా విభాగం అధ్యక్షురాలు బి.రత్నకుమారి, కార్యదర్శి పచ్చిపులుసు వరలక్ష్మి, కోశాధికారి నాళం శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు శింగంశెట్టి పద్మ, జాయింట్ సెక్రటరీ పాలూరి స్వాతి, ప్రోగ్రాం చైర్మన్ గ్రంధి శిరీష, కో చైర్మన్ నూలు లలిత పాల్గొన్నారు.

గాంధీభవన్ స్థాపనలో తనికెళ్ల పాత్ర ఎనలేనిది



గాంధీభవన్ వ్యవస్థాపకుడు సత్యనారాయణమూర్తికి నివాళి అర్పిస్తున్న కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: గాంధీజీ పిలుపు మేరకు ఆయన ఆశయ సాధనలో భాగంగా గాంధీభవన్ స్థాపించడంలో, బలహీన వర్గాల అభ్యున్నతికి తనికెళ్ల సత్యనారాయణమూర్తి ఎనలేని కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు గాంధీభవన్ వ్యవస్థాపకుడు తనికెళ్ల సత్యనారాయణమూర్తి జయంతిని ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించి, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. గాంధీభవన్ అధ్యక్షుడు వీఎల్ గాంధీ, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, సహాయ కార్యదర్శి వైఎస్‌వీఎస్ మూర్తి తనికెళ్లతో తమకున్న అనుబంధాన్ని వివరించారు. పిఠాపురంలో తనకు ఉన్న భూమిలో ఐదు ఎకరాలు విక్రయించి కాకినాడ గాంధీభవన్‌కు స్థలాన్ని కొన్నారన్నారు. దీనిలో అనేక సాంస్కృతిక, సంస్కరణ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అటువంటి మహనీయుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీభవన్ కార్యవర్గ సభ్యులు వి.సత్యనారాయణ, అల్లూరి సురేంద్ర, ఎంవీ భరతలక్ష్మి, ప్రొఫెసర్ దోసగిరిరావు పాల్గొన్నారు.

మత్స్యావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామ స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు మత్స్యావతారంలో భక్తులను దర్శనమిచ్చారు. స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



కెరటాల్లో కేరింతలు కొడుతున్న యువత



ఉప్పాడ సాగర తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. పర్యాటకులు కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. సెలవు రోజు కావడంతో కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు పిఠాపురం, సామర్లకోట, కిర్లంపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. ఉదయం తుని సమీపంలో తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సముద్ర స్నానాలు చేశారు. యువకులు తీరంలో గుర్రపు స్వారీ, మోటార్ సైకిల్ ర్యాలీ, విన్యాసాలు చేశారు. తీరంలో వాలీబాల్, క్రికెట్ ఆడి కేరింతలు కొట్టారు. సముద్ర కెరటాల మధ్య యువకులు చేసిన పిరమిడ్ విన్యాసాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాగా తీరంలో వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. కనీసం కూర్చోవడానికి బెంచీలు, తాగేందుకు మంచి నీరు అందుబాటులో లేక పర్యాటకులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.